మూతబడి..!

జీవీఎంసీ భీమిలి జోన్‌లో ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగవుతున్నాయి. భీమిలి పట్టణానికి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో సర్కారు బడులు లేకపోవడంతో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో వేలాది రూపాయలు ఖర్చు చేసి చదివించుకోలేక సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గోరు చుట్టుపై రోకలిపోటుగా కూటమి ప్రభుత్వం అమ్మకు వందనం పథకం కింద ఇస్తామన్న రూ.15 వేలు అమలు కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు దిక్కులు చూస్తున్నారు. వివిధ కారణాలతో ప్రభుత్వ బడులు మూతపడటం, తరలిపోవడం వంటివి జరగడంతో వారిలో అగమ్య గోచర పరిస్థితి ఏర్పడింది.

-తగరపువలస



గతేడాది విద్యార్థులు లేకుండానే నడచిన రాయిపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల


మరడపాలెం ప్రాథమిక పాఠశాల స్థానంలో ఏర్పాటైన అంగన్‌వాడీ కేంద్రం

భీమిలి జోన్‌లో కనుమరుగవుతున్న ప్రభుత్వ పాఠశాలలు

- విద్యార్థులు, వసతి సమస్యలు, వివిధ కారణాలతో మూసివేత, తరలింపు
- భీమిలి పట్టణంలోని మూడు కిలోమీటర్ల పరిధిలో వింత పరిస్థితి
- జీరుపేట నుంచి బ్యాంకు కాలనీ వరకు సర్కారు బడే లేదు
- పేద విద్యార్థులకు దూరాభారం.. తల్లిదండ్రుల్లో కలవరం

భీమిలి జోన్‌లోని చిల్లపేట, జీరుపేట గ్రామాలకు చెందిన వందలాది మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దిన చిల్లపేట నిర్మల బేసిక్ ఎయిడెడ్ స్కూల్ కాలక్రమేణా విద్యార్థులు లేక కనుమరుగైంది. ఈ గ్రామాన్ని ఆనుకుని రేఖవానిపాలెం పంచాయతీకి చెందిన మరడపాలెం ప్రాథమిక పాఠశాల కూడా విద్యార్థులు లేరన్న సాకుతో మూతపడగా.. ప్రస్తుతం ఇందులో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ గ్రామాన్ని ఆనుకుని ఉన్న రాయిపాలెంలో గతంలో 180 మంది విద్యార్థులు ఉన్న జీవీఎంసీ హైస్కూల్‌ను వసతులు లేవన్న సాకుతో కూల్చి బ్యాంకు కాలనీ శివారుకు తరలించుకుపోయారు. ఇదే గ్రామంలో జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల గతేడాది విద్యార్థులు లేకుండానే ఒకే ఉపాధ్యాయురాలితో నడిచింది. ఈ గ్రామాన్ని ఆనుకున్న దెక్కతిపాలెంలో వింత పరిస్థితి నెలకొంది. ఈ స్కూల్ ఆవరణలో దెక్కతిపాలెంతోపాటు బ్యాంకు కాలనీ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల కలిపి 12 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులతో గత విద్యా సంవత్సరం నడిచింది. బ్యాంకు కాలనీలోని ప్రాథమిక పాఠశాలను రాయిపాలెం జీవీఎంసీ హైస్కూల్ ఆక్రమించుకోగా.. బ్యాంకు కాలనీని ఆనుకుని ఉన్న తాతాజీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కూడా విద్యార్థులు లేక మూతపడింది.


దెక్కతిపాలెం స్కూల్‌లో నడుస్తున్న దెక్కతిపాలెం, బ్యాంకు కాలనీ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలు

ఓ చోట విద్యార్థులు.. మరో చోట వసతి కరవు

భీమిలిలో చాలా వరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉంటే వసతి, వసతి ఉంటే విద్యార్థుల కొరత కనిపిస్తోంది. జీరుపేట నుంచి బ్యాంకు కాలనీ వరకు మధ్యలో చుట్టూ ఉన్న 15 గ్రామాల ప్రజలకు ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో లేవు. వీరంతా భీమిలి, తగరపువలస, మూలకుద్దు ప్రాంతాల్లోని ప్రాథమికోన్నత, హైస్కూళ్లకు ఉసూరుమనుకుని వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడే కాకుండా జీవీఎంసీ పరిధిలో సంతపేట, బాలాజీనగర్, సంగివలస, నమ్మివానిపేట, పాత మూలకుద్దు, మద్దిలపేట, యాతపేట, అల్లూరి సీతారామారాజు కాలనీ, విల్సన్‌పేట తదితర జీవీఎంసీ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో కూడా పట్టుమని పది మంది విద్యార్థులు కూడా లేరు.


వసతి సమస్యతో రాయిపాలెం జీవీఎంసీ హైస్కూల్ తరలిపోగా.. పిల్లర్ల వరకే నిలిచిన పాఠశాల

అమలు కాని నిబంధనలు

జీరుపేట నుంచి బ్యాంకు కాలనీ వరకు రెండు కిలోమీటర్లు పరిధిలో ఆరు ప్రభుత్వ పాఠశాలలు మూతపడగా.. ఈ ప్రాంతంలో ఐదు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు దిగ్విజయంగా నడవడం విశేషం. విద్యా హక్కు చట్టం ప్రకారం కిలోమీటర్ పరిధిలో ప్రాథమిక, 3 కిలోమీటర్ల పరిధిలో ప్రాథమికోన్నత, ఐదు కిలోమీటర్ల పరిధిలో హైస్కూల్ ఉండాలన్న నిబంధనలు భీమిలిలో అమలు కావడం లేదు.

విద్యా శాఖ నిర్లక్ష్యంతో నిర్వీర్యం

వైఎస్సార్‌సీపీ హయాంలో నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారడమే కాకుండా విద్యార్థులకు అమ్మఒడి పథకం ద్వారా ఏటా రూ.15 వేలు తల్లుల ఖాతాలకు జమ చేసేవారు. కూటమి ప్రభుత్వం పథకం పేరు మార్చి రూ.15 వేలు వంతున తల్లికి వందనం అమలు చేస్తామని చెప్పి ఇవ్వకుండానే ఏడాది గడచిపోయింది. గత విద్యా సంవత్సరంలో విద్యా శాఖ నిర్లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమై పోయాయనడానికి ఇదే ఉదాహరణ. ఈ పరిస్థితిని చక్కదిద్ది ప్రభుత్వ పాఠశాలలను పునరుద్ధరించాలని భీమిలి జోన్ ప్రజలు కోరుతున్నారు.

పేద పిల్లలు చదువుకునేదెలా..?


ప్రభుత్వం నుంచి విద్య, వైద్యం అందుకోవడం పౌరుల ప్రాథమిక హక్కు. వీటిని విధిగా ప్రభుత్వం అందించాలి. జీరుపేట నుంచి బ్యాంకు కాలనీ వరకు ఏకంగా ప్రభుత్వ పాఠశాలలే లేవు. అలాంటప్పుడు 15 గ్రామాలకు చెందిన పేద పిల్లలు ఎక్కడ చదువుకుంటారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో చదువుకొనలేని వారి పరిస్థితి గురించి ప్రభుత్వం పట్టించుకోవాలి.

– ఉప్పాడ దుర్గాప్రసాద్, జీరుపేట

పట్టణ ప్రాంతంలో హైస్కూల్ లేదు


పేరుకే జీవీఎంసీలో ఉన్నాం కానీ.. అందుబాటులో హైస్కూల్ లేదు. గ్రామీణ ప్రాంతాల కంటే అధ్వానంగా ఇక్కడి పరిస్థితులు ఉన్నాయి. ఎనిమిదేళ్ల క్రితం రాయిపాలెం మున్సిపల్ హైస్కూల్ అందుబాటులో ఉండేది. వసతులు లేవన్న సాకుతో ఇక్కడి స్కూల్‌ను బ్యాంకు కాలనీలోని శివారుకు తరలించారు. దీంతో చాలా వరకు హైస్కూల్ విద్యకు స్వస్తి చెప్పారు. భీమిలి, తగరపువలస, మూలకుద్దు నడచివెళ్లి పేద పిల్లలు ఎలా చదువుకోగలరు

– సరగడ శివారెడ్డి, చిల్లపేట

పాఠశాలల పునరుద్ధరణ జరగాలి


వందేళ్ల చరిత్ర గల ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగు కావడం బాధాకరం. మళ్లీ వాటిని తెచ్చుకోవాలంటే ఎంతో కష్టం. ప్రత్యేక శిబిరాల ద్వారా వైద్యం అందించవచ్చు. విద్య అందించాలంటే తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలు ఉండాలి. అంగన్‌వాడీల నుంచి రిలీవ్ అయిన చిన్నారులకు ఎక్కడికి పంపిస్తారు. మూతపడిన ప్రభుత్వ పాఠశాలలను ప్రజల అవసరాలకు వినియోగించాలి.

– చిల్ల భాస్కరరెడ్డి, చిల్లపేట

క్లుప్తంగా

వాంబే కాలనీలో ‘స్వచ్ఛ భారత్’


ఆరోగ్య కేంద్రం వద్ద పరిసరాలు శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

మధురవాడ: ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేసి 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం బీజేపీ నాయకులు వాంబే కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద స్వచ్ఛ భారత్ నిర్వహించారు. వికసిత్ భారత్ సుపరిపాలనలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు వారు తెలిపారు. పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. కార్యక్రమంలో వైద్యుడు మోహన్‌కృష్ణ, మధురవాడ మండల అధ్యక్షుడు వై.అప్పారావు, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ఉదయ్‌బాస్కర్, నాయకులు పోతిన ప్రసాద్, దుర్గాసి రాము తదితరులు పాల్గొన్నారు.

భీమిలి డివిజన్ హౌసింగ్ ఈఈగా సూరిబాబు

ఎంవీపీకాలనీ: హౌసింగ్ కార్పొరేషన్ భీమిలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ)గా కె.సూరిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ కార్యదర్శి కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సూరిబాబు ప్రస్తుతం టెక్కలి డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనతోపాటు మరో 10 మందికి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఈ నేపథ్యంలో 2024–25 ఏడాదికి సూరిబాబును డిప్యుటేషన్‌పై భీమిలి డివిజన్ ఈఈగా నియమించారు. ఈ సందర్భంగా పలువురు సంస్థ ఉద్యోగులు ఆయనకు అభినందనలు తెలిపారు.

నేలకొరిగిన హట్‌ను తొలగించండి


రుషికొండ బీచ్ వద్ద కూలిన హట్

కొమ్మాది: పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో పర్యాటకులకు ఏదో ఒక సమస్య ఇబ్బంది కలిగిస్తోంది. మొన్నటి వరకు బీచ్‌లో తీరానికి భారీ ఎత్తున వ్యర్థాలు చేరడంతో పర్యాటకులు అసహనానికి గురయ్యారు. ఇప్పుడు తీరం వద్ద గతంలో ఏర్పాటు చేసిన హట్ ఒకటి నేలకొరిగింది. దీని వల్ల సందర్శకుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. అది కళావిహీనంగా కూడా కనిపిస్తోంది. హట్ నేలకొరిగి రోజులు గడుస్తున్నా.. సంబంధిత అధికారులు మాత్రం దీనిని తొలగించడంలో జాప్యం చేస్తున్నారు. తక్షణం దీనిని తొలగించాలని పలువురు సందర్శకులు కోరుతున్నారు.

యువకుడి అదృశ్యం


యుగంధరరావు

పద్మనాభం: విజయరాంపురానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమైనట్టు పద్మనాభం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మండలంలోని బాందేవపురం పంచాయతీ విజయరాంపురం గ్రామంలో నివసిస్తున్న రాంబోతు యుగంధరరావు అనే యువకుడి తల్లిదండ్రులు ఈ నెల 4న ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లారు. ఇంట్లో వారు లేని సమయంలో యుగంధరరావు బయటకు వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదు. యువకుడి తండ్రి రామునాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పద్మనాభం పోలీసులు తెలిపారు.

వృత్తి విద్యా శిక్షణలో ఇగ్నో కీలకం

ఎంవీపీకాలనీ: నైపుణ్యం, వృత్తి విద్యా శిక్షణలో ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) పాత్ర కీలకమని కేంద్ర విద్యా శాఖ ఆర్థిక సలహాదారు మృత్యుంజయ బెహరా పేర్కొన్నారు. విశాఖ పర్యటనలో ఉన్న ఆయన సోమవారం ఎంవీపీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయంలో ఇగ్నో ద్వారా అందిస్తున్న కార్యక్రమాలను సమీక్షించారు. విద్యార్థులకు ఇగ్నో అధ్యయన కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను పరిశీలించారు. నగరంలోని పలు సెంటర్లను సందర్శించిన మృత్యుంజయ బెహరా అక్కడ సౌకర్యాలపై ఆరా తీశారు. ఇగ్నో అధ్యాపకులతో సమావేశమై జాతీయ విద్యా విధానంలో కళాశాలల పాత్రను విశదీకరించారు.

జోన్-2 పీజీఆర్ఎస్‌కు 12 అర్జీలు


జెడ్సీ కనకమహాలక్ష్మికి మురుగు సమస్యను వివరిస్తున్న సీపీఎం నాయకులు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ డైలీ మార్కెట్ రోడ్డుపైకి మురుగు నీరు తరచూ పొంగడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు డి.అప్పలరాజు, పి.రాజ్‌కుమార్ కోరారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జోన్–2 కమిషనర్ కొట్యాడ కనకమహాలక్ష్మికి ఫిర్యాదు పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ ప్రాంతంలో నెలల తరబడి ఇదే పరిస్థితి ఉన్నా.. ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. 5వ వార్డు గణేష్‌నగర్ ప్రభుత్వ స్కూల్ వెనుక ఉన్న పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఎన్నిసార్లు ఫిర్యాదులు ఇస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, ఇంత నిర్లక్ష్యం తగదంటూ టీడీపీ సీనియర్ నాయకుడు సుజీవరావు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 6వ వార్డు తులసీనగర్ పార్కు వద్ద అక్రమ బడ్డీలు తొలగించాలని తులసీనగర్ ఫ్రెండ్లీ వాకర్స్ అసోసియేషన్ తరఫున లోవరాజు, సూరిబాబు తదితరులు ఫిర్యాదు ఇచ్చారు. 6వ వార్డు కొమ్మాది హౌసింగ్ బోర్డు కాలనీలో ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తున్న ఏడాకుల చెట్లు తొలగించాలని, ఈ కాలనీలో ఉన్న ఆర్ ప్లాంట్‌ను తొలగించాలని టీడీపీ నాయకుడు గొల్లంగి ఆనందబాబు ఫిర్యాదు చేశారు. హెచ్‌పీసీఎల్ లేఅవుట్‌లో తాగునీటి సరఫరా సక్రమంగా చేయాలని లలితకుమారి ఫిర్యాదు ఇచ్చారు. జోన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి 12 అర్జీలు అందగా.. తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను జెడ్సీ కనకమహాలక్ష్మి ఆదేశించారు.

సమస్య పరిష్కరించకుండానే.. క్లోజ్ ఎలా?

జీవీఎంసీ 7వ వార్డు స్వతంత్రనగర్‌లో పార్కుల ఆక్రమణపై చర్యలు చేపట్టాలని తాను ఫిర్యాదు ఇచ్చానని, దానిని పరిష్కరించ కుండానే సమస్య పరిష్కారమైందని అధికారులు అర్జీ క్లోజ్ చేయడం ఎంత వరకు సబబని సామాజిక కార్యకర్త చేకూరి రజని ప్రశ్నించారు. జెడ్సీ కనకమహాలక్ష్మిని ఆమె కలిసి దీనిపై ఫిర్యాదు ఇచ్చారు. పార్కులో ఆక్రమణలు తొలగించకుండానే తొలగించినట్టు తప్పుడు సమచారమిచ్చారని, అధికారుల తీరు మారకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని రజని తెలిపారు.

స్వతంత్రనగర్ పార్కు స్థలం కబ్జాపై ఫిర్యాదు


జెడ్సీ కనకమహాలక్ష్మికి సమస్య వివరిస్తున్న సామాజిక కార్యకర్త రజని

ఆరిలోవ: మధురవాడ ప్రాంతం స్వతంత్రనగర్‌లో బ్రహ్మంగారి ఆలయం వద్ద జీవీఎంసీ పార్కు స్థలాన్ని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని రూరల్ తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో తహసీల్దార్ పాల్‌కిరణ్‌కు ఆ ప్రాంతానికి చెందిన సామాజిక కార్యకర్త చేకూరి రజని ఫిర్యాదు చేశారు. ఆక్రమించిన స్థలంలో చేపట్టిన నిర్మాణాలకు అక్రమ మార్గంలో పట్టాలు పొందారని, వాటిని ఇప్పుడు క్రమబద్ధీకరించుకోవడానికి సిద్ధమవుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల మరో వ్యక్తి కూడా అక్కడ స్థలాన్ని ఆక్రమించి షెడ్ నిర్మించాడన్నారు. ఈ ఆక్రమణలపై తహసీల్దార్ దృష్టి పెట్టి నిర్మాణాలకు క్రమబద్ధీకరణ నిలిపివేయాలని ఆమె కోరారు.

భీమిలి జోన్‌కు 10 వినతులు

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 10 వినతులు వచ్చాయి. జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ఫిర్యాదులు స్వీకరించారు. ఇంజినీరింగ్ విభాగానికి ఆరు, ప్రజారోగ్య విభాగానికి మూడు, పట్టణ ప్రణాళిక విభాగానికి ఒక వినతి వచ్చినట్లు జెడ్సీ తెలిపారు. వీటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని జెడ్సీ తెలిపారు.

భీమిలి బీచ్‌లో సదుపాయాల కల్పనకు వినతి


జెడ్సీ అయ్యప్పనాయుడుకు వినతి పత్రం అందిస్తున్న వినియోగదారుల సంఘ సభ్యులు

భీమునిపట్నం: భీమిలి బీచ్‌లో పర్యాటకులు, ప్రజలకు అవసరమైన సదుపాయాలను కల్పించాలని కోరుతూ సోమవారం వినియోగదారుల సంక్షేమ సంఘ సభ్యులు జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి పి.రాజేంద్రప్రసాద్ వర్మ మాట్లాడుతూ బీచ్ వద్ద మంచి నీటి సౌకర్యం లేదని, ఫుట్‌పాత్‌లపై దుకాణాల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, బీచ్‌కు రక్షణగా రక్షణ గోడ నిర్మించాలని కోరారు. సంఘం అధ్యక్షులు కె.ఎస్.నాయుడు, సభ్యులు పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, ఎం.శ్రీనివాస్, మైలపల్లి లక్ష్మణరావు, ఆదినారాయణ, జోగారావు, భీమారావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యోగా అవగాహన ర్యాలీలు


ర్యాలీలో పాల్గొన్న జెడ్సీ కనకమహాలక్ష్మి


ర్యాలీలో జెడ్సీ అయ్యప్పనాయుడు తదితరులు

కొమ్మాది: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని సోమవారం 8వ వార్డులో యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎండాడ, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, దుర్గానగర్ ప్రాంతాల్లో జోన్–2 జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో ఉత్సాహంగా ర్యాలీ జరిగింది. ర్యాలీలో పాల్గొన్న వారికి యోగా వల్ల కలిగే ఉపయోగాలు వివరించారు. ఈ నెల 21 విశాఖ వేదికగా జరగనున్న యోగా దినోత్సవంలో ప్రజలందరూ పాల్గొనాలని ఆమె సూచించారు. ఉప్పులూరి గోపి, బోడెపూడి దొరబాబు, ఒమ్మి బాబూరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవంలో పాల్గొనండి

భీమునిపట్నం: భీమిలి మెయిన్ రోడ్డులో సోమవారం యోగా అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు మాట్లాడుతూ ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అందరూ పాల్గొనాలని కోరారు. యోగా సాధనతో ఆరోగ్యంగా ఉంటామన్నారు. జోనల్ కార్యాలయం, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నగరంపాలెంలో..

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు నగరంపాలెంలో సోమవారం యోగా అవగాహన ర్యాలీ జరిగింది. జీవీఎంసీ అధికారులు, సిబ్బంది ప్లకార్డులతో ర్యాలీ చేశారు. ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటామని అవగాహన కల్పించారు.

కూటమి నాయకులు చెప్తే.. తొలగించేస్తారా..?

తుఫాన్ రక్షిత భవనాల కూల్చివేతపై 8వ వార్డు వాసుల అసహనం


సాగర్‌నగర్‌లో తొలగిస్తున్న తుఫాన్ రక్షిత భవనం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో కూటమి నాయకుల తీరుపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వార్డులోని సాగర్‌నగర్, రుషికొండ, ఎండాడ ప్రాంతాల్లో మూడు తుఫాన్ రక్షిత భవనాలు ఉన్నాయి. ఇవి వాస్తవానికి శిథిలావస్థకు చేరాయి. వీటిని తొలగించి ఇదే స్థానంలో తుఫాన్ రక్షిత భవనాలనే నూతనంగా నిర్మించాలని స్థానికుల ఆకాంక్ష. ఈ ప్రాంతాలన్నీ సముద్రానికి అతి సమీపంలో ఉండటంతో తుఫాన్ ప్రభావం, తీవ్రత వీటిపై ఎక్కువగా ఉంటుంది. అటువంటి సమయాల్లో స్థానికులు తలదాచుకోవడానికి ఈ భవనాలు ఉపయోగకరంగా నిలుస్తాయి. ఈ మూడు భవనాలను తొలగించాలని ఇటీవల కూటమి నాయకులు ఎమ్మెల్యే గంటాకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.3.50 లక్షల వ్యయంతో ఒక్కో భవనాన్ని తొలగిస్తున్నారు. ఒక శిథిల భవనాన్ని తొలగించడానికి ఇంత పెద్ద మొత్తంలో నిధులు వృథా చేయడం ఎందుకని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ముందుగా నూతన భవనంమంజూరైన తరువాత పాత దాన్ని తొలగించాలని, ఏదీ లేకుండా స్థానిక కూటమి నాయకులు ఇచ్చిన ఫిర్యాదుతో భవనాలు తొలగించడమేంటని స్థానికులు మండిపడుతున్నారు. తొలగించిన తుఫాన్ రక్షిత భవనాల స్థానంలో మళ్లీ అవే నిర్మించాలే తప్ప.. వేరేవి నిర్మిస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నారు.

డి-కబెనా రిసార్ట్స్ మూసివేత


రిసార్ట్ వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

కొమ్మాది: బీచ్ రోడ్డులోని సాగర్‌నగర్‌లో ఉన్న డి–కబెనా రిసార్ట్‌ను రెవెన్యూ అధికారులు మూసివేశారు. ప్రభుత్వ స్థలాన్ని పూర్తిగా ఆక్రమించి ఈ రిసార్ట్‌ను నిర్మించడంతో అధికారులు పరిశీలించి ఈ చర్య తీసుకున్నారు. ఈ రిసార్ట్‌లో పలు చోట్ల ‘ఈ స్థలం ప్రభుత్వానికి చెందినది. ఎవరైనా ఆక్రమించినచో శిక్షార్హులు’ అని హెచ్చరిక బోర్డులను రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారు.

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలి



రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

తగరపువలస: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 3,100 మంది కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును నిరసిస్తూ, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ భీమిలి డివిజన్ సీపీఎం నాయకులు సోమవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నాలుగున్నరేళ్లుగా కార్మిక, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు తీసుకొచ్చిన ప్యాకేజీ కర్ణాటక స్టీల్‌ప్లాంట్ కంటే తక్కువన్నారు. వీఆర్ఎస్ పేరుతో 1,200 మంది పర్మినెంట్ కార్మికులను ఇంటికి పంపారన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.19.34 లక్షల కోట్లు మొండి బకాయిలు కార్పొరేట్ సంస్థలు, పెట్టుబడిదారులకు రద్దు చేసిందని చెప్పారు. తొలగించిన కార్మికులకు వెంటనే విధుల్లోకి తీసుకుని ప్రైవేటీకరణ మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పంపాన సూర్యనారాయణ, పెంట రాజు, చిన్నారావు, రాము, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ గెడ్డవాగు కబ్జా


గుడిలోవ ఛానల్‌కు చెందిన గెడ్డవాగును పూడ్చిపెట్టి కబ్జా చేసిన దృశ్యం

తగరపువలస: ఆనందపురం మండలం పందలపాక రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 85/10, 11లోని గుడిలోవ ఛానల్‌కు చెందిన ప్రభుత్వ గెడ్డ వాగును పూడ్చివేసి కబ్జాకు ప్రయత్నిస్తున్నారని పాలవలస పంచాయతీ వాసులు చెబుతున్నారు. చెరువులకు అనుసంధానంగా ఉన్న ఈ గెడ్డవాగును మాయం చేయడంలో మాజీ సర్పంచ్ అప్పలనారాయణ, ఆయన కుమారుడు సురేష్‌ల హస్తం ఉందని ఆరోపిస్తున్నారు. గతంలో ఉన్న గెడ్డతోపాటు దారులను కూడా కనిపించకుండా చేశారన్నారు. అడిగిన వారిపై దౌర్జన్యం చేస్తున్నా.. ఆనందపురం రెవెన్యూ సిబ్బంది కబ్జాదారులతో చేతులు కలిపి రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. గెడ్డతోపాటు రహదారి కబ్జాకు పాల్పడుతున్న వారిపై ఆనందపురం రెవెన్యూ సిబ్బంది చర్యలు తీసుకోని కారణంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు పాలవలస పంచాయతీ వాసులు తెలిపారు.

వానొస్తే కాలువలా రహదారి


సాయిప్రియా గార్డెన్స్‌లో రోడ్డుపై కాలువలా ప్రవహిస్తున్న వర్షపు నీరు

పీఎం పాలెం: చిన్నపాటి వర్షం కురిసినా.. ఆ రోడ్డు వరద నీరు ప్రవహించే కాలువలా మారుతోంది. ఆ సమయంలో ప్రయాణం దుర్భరంగా ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదీ సాయిప్రియా గార్డెన్స్ లేఅవుట్ రహదారి పరిస్థితి. ఈ ప్రాంతంలో సుమారు 400కు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇక్కడి వారంతా ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తారు. బక్కన్నపాలెం వెళ్లే డబుల్ రోడ్డుకు, డీ మార్ట్‌కు ఈ రహదారి గుండా చేరుకోవచ్చు. ఈ రోడ్డుకు అనుసంధానంగా నిర్మించిన అంతర రహదారుల కంటే ఇది పల్లంగా ఉండటంతో వర్షం పడిన ప్రతిసారీ ఈ మార్గంలో నీరంతా చేరి భారీ కాలువను తలపిస్తోంది. సంబంధిత జీవీఎంసీ అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.